హరీష్‌రావును కలిసిన బీఆర్ఎస్ శాసనసభ విప్ వివేకానంద్



హరీష్ రావుతో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

కుత్బుల్లాపూర్: శాసనసభ బీఆర్ఎస్ విప్‌గా నియమితులైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ గురువారం మాజీ మంత్రి హరీష్‌రావును ఆయన నివాసంలో కలిశారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని హరీష్‌రావు సూచించారు. నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శేషగిరి, జలమండలి మేనేజర్ రోహిణి

చింతల్: మెకానిగూడలోని మురుగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గురువారం వాటర్ వర్క్స్ సెక్షన్ మేనేజర్ రోహిణితో కలిసి మెకానిగూడలో పర్యటించారు. తాగునీరు, మురుగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

వేణుగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బిల్డర్స్ ఫెడరేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం పరామర్శించింది. గురువారం కొంపల్లిలోని వేణుగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి రాయల మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు సురేష్, కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు గోపాల్‌రెడ్డి సతీమణితో పాటు ఆయన తల్లిదండ్రులను కలిసి సంఘీభావం తెలిపారు. ఫెడరేషన్ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్‌రావు, మారం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడి ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కిన మహిళ

కిందకు దింపి కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

జగద్గిరిగుట్ట: ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఎక్కిన మహిళకు జగద్గిరిగుట్ట పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. పోలీసుల వివరాల ప్రకారం.. వేంకటేశ్వరనగర్‌కు చెందిన రాధిక(40) గురువారం ఈసేవా సెంటర్‌లో కుమారుడి ఆధార్ కోసం గొడవ పడింది. అనంతరం స్థానికంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎక్కింది. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రాధికను కిందకు దింపారు. గతంలో కల్లు కాంపౌండ్‌లో సైతం ఆమె గొడవ పడి స్టేషన్‌కు వెళ్లిన ఘటన చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి శ్యామ్ కలిసి పార్టీ అభివృద్ధిపై మాట్లాడారు. గతంలో మల్కాజిగిరి యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగిన సమయంలో పార్టీ కోసం చేసిన కృషిని శ్యామ్‌గౌడ్ వివరించారు. రాబోయే రోజుల్లో నామినేటెడ్ పోస్టుల్లో తనకు అవకాశం ఇవ్వాలని సీఎంను కోరారు.

– కుత్బుల్లాపూర్

సర్వీస్ రోడ్డులా.. పార్కింగ్ స్థలాలా?



ఫేజ్ 3లో రోడ్డుపై నిలిపిన వాహనాలు

- గంటల పాటు రోడ్లపైనే లారీలు, ట్రక్కులు
- పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ పార్కింగ్‌తో తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న సర్వీస్ రోడ్లు వాహనాల అక్రమ పార్కింగ్ స్థలాలుగా మారాయి. వాహనాలు విచ్చలవిడిగా రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్లలో పారిశ్రామికప్రాంతం ఫేజ్ 1 నుంచి మొదలుకుని ఫేజ్ 5 వరకు విస్తరించి ఉంది. ఇక్కడ దాదాపు 2 వేల పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడికి ప్రతి నిత్యం వేల సంఖ్యలో భారీ నుంచి అతి భారీ వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం వస్తుంటాయి. ఇలా వచ్చిన వాహనాలు కొన్నిసార్లు దాదాపు 24 గంటల పాటు ఇక్కడే వేయిటింగ్‌లో ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో వాహనాలను రోడ్లపై విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తున్నారు. కొన్నిసార్లు పెద్ద వాహనాలు వచ్చే క్రమంలో మలుపుల వద్ద వాహనాలు పార్కింగ్ చేసి ఉండటంతో వచ్చే వాహనాలు తిరగలేక ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రీ పార్కింగ్ లేకపోవడంతో..

6 సంవత్సరాల క్రితం ఇదే విధంగా వాహనాల పార్కింగ్ విషయంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఐలా, టీఎస్ఐఐసీ అధికారులు జీడిమెట్ల ఫేజ్ 3లో 2.5 ఎకరాల్లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. పార్కింగ్ స్థలాన్ని పెయిడ్ పార్కింగ్‌గా మార్చి రూ.200 నుంచి 500 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలు, ట్రక్కుల డ్రైవర్లు వాహనాలను రోడ్లపైనే గంటలపాటు నిలిపి పార్కింగ్ ఫీజు తప్పించుకుంటున్నారు. రోడ్లపై వాహనాల పార్కింగ్ వల్ల ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులు పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



జీడిమెట్ల ఫేజ్ 5రోడ్డులో ట్రాఫిక్‌జాం

అవగాహన కల్పిస్తే మేలు

జీడిమెట్ల ఫేజ్ 3 ఐలా కార్యాలయం సమీపంలో పార్కింగ్ కోసం స్థలం కేటాయించినట్లు ఇతర రాష్ట్రాల డ్రైవర్లకు తెలియదు. కావున పార్కింగ్ స్థలం ఉన్నట్లు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తెలియజేస్తే బాగుంటుందని డ్రైవర్లు పేర్కొంటున్నారు. పార్కింగ్ కోసం ఒకే చోట స్థలం ఉండటంతో ఇతర ప్రాంతాల్లో లేకపోవడం కూడా సమస్యగా మారింది. కావున జీడిమెట్లలో అనువుగా ఉన్న మరో ప్రాంతాన్ని సైతం పార్కింగ్ కోసం కేటాయిస్తే ఇతర వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగవని డ్రైవర్లు పేర్కొంటున్నారు.

జాతర నేపథ్యంలో భారీ వాహనాల మళ్లింపు

ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్



కట్టమైసమ్మ ఆలయ ప్రధాన రోడ్డును పరిశీలిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్

సుభాష్‌నగర్: సూరారంలోని కట్టమైసమ్మ జాతర నేపథ్యంలో భారీ వాహనాల మళ్లింపునకు సహకరించాలని మేడ్చల్ డివిజన్ ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్ అన్నారు. గురువారం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలపై ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు జాతర సందర్భంగా సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి నుంచి జ్యోతి మిల్క్ వరకు వన్ వే ఉంటుందని తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి వరకు గండిమైసమ్మ నుంచి బాలానగర్ మధ్య వచ్చే భారీ వాహనాలను బహదూర్ పల్లి, దూలపల్లి, జీడిమెట్ల పారిశ్రామిక వాడ మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రధాన జాతరలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మేడ్చల్ డివిజన్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలోని 90 మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏసీపీ వెంకట్ రెడ్డి, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, సూరారం సీఐ భరత్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన లిటరసీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందజేస్తున్న సీఐలు మల్లేష్, విజయవర్ధన్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లిటరసీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ గురువారం ముగిసింది. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి జీడిమెట్ల సీఐ మల్లేష్, పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ మీట్‌లో 80 పాఠశాలలు పాల్గొన్నాయి. ఖోఖో గర్ల్స్ విభాగంలో నేతాజీ హైస్కూల్ ప్రథమ, వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ రన్నరప్‌గా, అదే విధంగా ఖోఖో బాలుర విభాగంలో వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ ప్రథమ, నేతాజీ హై స్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ట్రస్మా ఉపాధ్యక్షుడు మల్లేశం, చైర్మన్ శివయ్య, మండల అధ్యక్షుడు మహేష్ కుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మండవ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

డెబ్రిస్‌ను డంప్ చేస్తున్న టిప్పర్లు సీజ్

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ భూమిలో డెబ్రిస్‌ను డంప్ చేస్తున్న ఏడు టిప్పర్లను జగద్గిరిగుట్ట పోలీసులు సీజ్ చేసి డ్రైవర్లు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామ సర్వే నంబర్ 307 ప్రభుత్వ భూమిలో డెబ్రిస్‌ను డంప్ చేస్తున్నారని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులామ్ కలీం బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో డీఆర్ఎస్ టీమ్‌తో కలిసి దాడులు నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో డంప్ చేస్తున్న ఏడు టిప్పర్లను (ఏపీ31టీబీ 6122), ఏపీ05టీసీ 6122, టీఎస్12యూబీ2907, ఏపీ26వై 2819, టీఎస్12యూడీ



1728, టీఎస్15యూసీ 1912, ఏపీ31టీబీ 8833) సీజ్ చేశారు. డంపింగ్‌లకు పాల్పడుతున్న టిప్పర్ డ్రైవర్లు సింగం శ్రీనివాస్, జితేంద్రసోను, పసుపుల రాము, నలవల రాము, పసుపుల నవీన్, రాజమాని రాము, అల్లి లింగన్నలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ చాంబర్‌కు మరమ్మతులేవి?



రంగారెడ్డినగర్: గోదావరి ప్రధాన పైపులైన్ చాంబర్ శిథిలావస్థకు చేరుకున్నా జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. శామీర్‌పేట్ నుంచి సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డు మీదుగా షాపూర్‌నగర్ హెచ్ఎంటీ నుంచి కూకట్‌పల్లి, ఆల్వాల్, కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్లకు గోదావరి జలాల సరఫరా చేసే 800 ఎంఎం, 1000 ఎంఎం, 1500 ఎంఎం డయా పైపులైన్ హైదర్‌నగర్‌లోని జలమండలి స్టోరేజ్ చాంబర్‌కు వెళ్తోంది. కాగా షాపూర్‌నగర్– జగద్గిరిగుట్ట రోడ్డులో ఇటీవల ఓ గుర్తు తెలియని వాహనం చాంబర్‌ను ఢీకొట్టడంతో ధ్వంసమైంది. రెండు, మూడు నెలలుగా సదరు చాంబర్‌కు మరమ్మతులు చేయడంలో ట్రాన్స్‌మిషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ చాంబర్ గుండా వెళ్లే పైపులైన్‌లు ధ్వంసమైతే ఆల్వాల్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, మూసాపేట్, కూకట్‌పల్లి సర్కిళ్లకు నీటి సరఫరా నిలిచిపోతుంది. మరలా వాటిని పునరుద్ధరించాలంటే మూడు రోజులు పడుతుందని స్థానిక జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు స్పందించి దెబ్బతిన్న చాంబర్‌కు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్ : బాచుపల్లి మండలం రాజీవ్‌గాంధీ నగర్‌లో అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కొద్ది రోజులుగా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు నిర్మాణాలను కూల్చివేశారు. సర్వే నంబర్ 292లో గతంలో సైతం అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదేశాల మేరకు ఆర్ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు.

మహిళ అదృశ్యం



నిజాంపేట్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న యాదమ్మ ప్రగతినగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తుంది. ఈ నెల 3వ తేదీన సాయంత్రం 5:20 గంటల సమయంలో హాస్టల్‌లో ఉంటున్న తన కూతురు దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. కూతురిని కలిసి అన్నం తినిపించింది. అనంతరం ఇంటికి వెళ్తున్నానని కూతురికి చెప్పి ఇంటికి బయలుదేరింది. కానీ ఇప్పటివరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కట్కామ్ శ్రీనివాస్, కేతావత్ మంగమ్మ, ఎండీ బషీర్‌లకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలన సాగుతుందన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలు వివిధ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేమ్స్, అమర్ బాబు, ధరణి, మధు యాదవ్, భరత్, మోతె శీను, సంజీవ్, టైగర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే డబ్బులు చెల్లించాలి



కుత్బుల్లాపూర్ కార్యాలయానికి వచ్చిన ఎన్యుమరేటర్లు

అధికారుల చుట్టూ తిప్పుకుంటున్నారని ఎన్యుమరేటర్ల ఆగ్రహం

కుత్బుల్లాపూర్: కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొన్న తమకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 1478 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహించారు. ఒక్కొక్కరు 150 కుటుంబాలను రోజుకు 10 కుటుంబాలు చొప్పున సర్వే చేశారు. అంతవరకు బాగానే ఉంది. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున వేతనం చెల్లిస్తామని అధికారులు చెప్పారని పలువురు తెలిపారు. సర్వే పూర్తి చేసిన తర్వాత అధికారులను డబ్బులు అడిగితే ఇదిగో అదిగో అంటూ కార్యాలయం చుట్టూ నెల రోజులుగా తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల వద్ద ఎవ్వరూ కూడా సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయంపై ఉప కమిషనర్ నరసింహను 'సాక్షి' వివరణ కోరగా.. బ్యాంకు అకౌంట్ నంబర్లు తప్పుగా ఇవ్వడం వల్ల కొంత ఇబ్బందులు వచ్చాయని, ఇప్పటివరకు సుమారు 600 మందికి డబ్బులు వేశామని, మరో 144 మందికి కూడా దశలవారీగా డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

టీఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అసోసియేషన్ నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని మున్సిపల్ గ్రౌండ్‌లో గురువారం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీఆర్ఎస్ఎంఏ) ఆధ్వర్యంలో లీటరల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఎంఈవో జెమిని కుమారి, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రటరీ పరశురామ్, మండల అధ్యక్షులు శ్రీనివాస్ చారీ, తిరుపతి రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



కుత్బుల్లాపూర్: కొంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్ హోల్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆదిత్య గార్డెన్స్‌లో డ్రైనేజీ మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. నెల రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ మ్యాన్ హోల్ పగిలి ఉంది. దీంతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా చిన్న పిల్లలు రోడ్డుపై ఆడుకునే సమయంలో సైతం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



బ్రహ్మోత్సవాలకు కీసర ముస్తాబు



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే లక్షలాది మంది యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం, జిల్లా యాంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24 నుంచి మార్చి 1వరకు జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సుమారు 6 నుండి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఏర్పాట్లకు సంబంధించిన ఆదేశాలు అధికారులు జారీ చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏర్పాట్లకు తగిన సూచనలు చేసిన విషయం విధితమే.

ఏర్పాట్లు ఇలా...
కీసరగుట్ట ప్రధాన ఆలయం వద్ద ఇప్పటికే క్యూలైన్లు సిద్ధమౌతున్నాయి. గతంలో స్వామిదర్శనం కోసం 5 క్యూలైన్లు ఏర్పాటు చేస్తే.. ఈసారి 6 క్యూలైన్లు ఏర్పాటు చేసి 3 క్యూలైన్లు సామాన్య భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దీంతో ఉచిత దర్శనం కోసం క్యూలైన్లలో ఉండే భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆకర్షణీయంగా రంగులు..
ప్రధాన ఆలయంతో పాటు మహామండపం, రాజగోపురాలు, ఆంజనేయస్వామి విగ్రహానికి రంగులు వేసే పనులు కుడా కొనసాగుతున్నాయి.
ఇక కీసరగుట్ట ప్రధాన దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం తదితర ప్రాంతంలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ల ఏర్పాట్లు కుడా కొనసాగుతున్నాయి.

చెట్ల కొమ్మల తొలగింపు..
ఇక విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రహదారుల వెంట విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు దాదాపు పూర్తయ్యాయి. జాతర జరిగే ప్రాంతంలో అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని విద్యుత్ ఏఈ మురళికృష్ణ తెలిపారు.

వంటశాలకు శాశ్వత షెడ్డు..
లడ్డూప్రసాదాలు తయారీకి ప్రతి ఏటా తాత్కాలికంగా వంటశాల ఏర్పాటు చేసేవారు. ఈసారి వంటశాలకు కుడా పర్మనెంట్‌గా షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కుడా కొనసాగుతున్నాయి.

రూ.1.50 కోట్ల నిధుల కేటాయింపు..
బ్రహ్మోత్సవాలకు సుమారు రూ. కోటిన్నర వరకు నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు సమాచారం. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో టిక్కట్లు ఉంటాయి. భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకుని సమయానికి వచ్చి స్వామిదర్శనం చేసుకునేలా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

24 గంటలు అన్ని సౌకర్యాలు..
జాతర జరిగే రోజుల్లో 24 గంటల పాటు భక్తులకు తాగునీరు, నిత్యావసరాలకు కావాల్సిన నీటిని సరఫరా చేసేలా మిషన్ భగీరథ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. 24గంటలు పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, జాతర జరిగే పరిసర ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

వాహనాల పార్కింగ్‌కు..
ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు, భారికేడ్ల ఏర్పాట్లు చేయనున్నారు. 24 గంటలపాటు అంబులెన్స్‌లతో పాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

- తామర కొలను దగ్గర గజ ఈతగాళ్లను మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.
- వివిధ ప్రాంతాల నుంచి యాత్రికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు సుమారు 400 నుంచి 800 వరకు ప్రత్యేక బస్సులు నడిపేలా తగిన చర్యలు చేపడుతున్నారు.

సైన్ బోర్డుల ఏర్పాటు..
వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వై జంక్షన్ నుంచి దేవాలయం వరకు ఉచిత ఆటోలు, షెటిల్ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడే సైన్‌బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 1700 నుంచి 2000 వేల మంది పోలీసులతో తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని శాఖల సమన్వయం కోసం సమీకృత కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేసేలా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు.